
# నాకు నచ్చిన నా కథ



దివాకర్ల సన్యాసిరాజు

"పందెం" అనే ఈ చిన్న కథ ఆంధ్రప్రభ వారపత్రికలో 18 సంవత్సరాల క్రిందట 8-1-1964 లో ప్రచురించబడినది.

సుమారు రెండు వందలకి పైగా నా రచనలు దిన, వార, మాస పత్రికల్లో ప్రచురింపబడినా ఎందుకో ఈ చిన్న కథ నాకు నచ్చింది- కారణం బహుశా యదార్థం కావచ్చు.

"పశువులు కూడా మనుషుల మనసు తెలుసుకొని, సానుభూతి చూపగలవని, ప్రేమించగలవని, అవసరమైతే ప్రాణాలు సైతం విడువగలవని అంటారు.

ఆలోచనాశక్తి లేని ప్రాణులకు ఈ శక్తి ఎలా వచ్చింది? అనుభవమే సమాధానం అవుతుంది, మరి."

## పందెం

తళుక్కుమని కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపు మెరిసి మాయమైంది.

వర్షం కుండపోతగా కురుస్తోంది. చల్లటి రొజ్జగాలి తీవ్రతకు వర్ష ధారలు ఏటవాలుగా పడుతున్నాయి. అది అసలే పల్లెటూరు.

ఎప్పుడూ, ఎక్కడో ఒకచోట బురద, నీరు ఉండనే ఉంటుంది. మరి వర్షంపడితే చెప్పనక్కర్లేదు. ప్రతి యింటిముందూ, ప్రతి గుడిసెముందూ నీరు మోకాలులోతు ప్రవహిస్తుంది.

నేను నా గదిలో కూర్చొని పత్రిక తిరగేస్తున్నాను. అది క్రిందటివారం నేను వచ్చినప్పుడు కొన్నది ఎడ్వర్టయిజ్‌మెంట్సుతో సహా పూర్తిగా చదివి వదిలిపెట్టాను. ఏం తోచడంలేదు. నేను రాను మొర్రో అంటే— "సెలవులు రెండునెలలు ఆ పట్నంలో ఎందుకో! హోటల్ మెతుకులు తింటూను? వెంటనే యింటికి రా" అని వ్రాశారు నాన్నగారు.

మొండికెత్తి రావడం మానేస్తే ఆయనే బయలుదేరి చక్కా వస్తారని, నాలుగురోజులుండి వచ్చేయొచ్చని వచ్చి చిక్కడిపోయాను—

చల్లటి ఈదురుగాలి వణికిస్తోంది. గదంతా మసకచీకటి అలుముకుంది.

గదిలోంచి వరండాలో కూర్చుందామని లేచాను.

"చినబాబూ! కాఫీ" అంటూ లక్ష్మి గుమ్మంలో నిలబడింది.

"ఇలా తే. ఈ కుర్చీ వరండాలో వెయ్యి" అంటూ కాఫీ ఒక్క గుక్కలో త్రాగిన తరవాతగాని చలికి వణుకు తగ్గలేదు.

ఆకాశం చిల్లులుపడినట్లు వర్షధారలు పడుతూనే ఉన్నాయి.

లక్ష్మిమొగుడు— రావయ్య గోడవారగా ముడుచుకు కూర్చున్నాడు, చుట్ట కాల్చుకొంటూ.

అబ్బ, సిగరెట్ కాల్చి నాలుగురోజులైంది.

"ఏం చినబాబూ! పట్నంలో అలవాటైనోళ్ళకి యీ పల్లెటూళ్ళో ఏటీ తోచదు కద బాబూ" అన్నాడు నవ్వుతూ.

"మరేం చెయ్యమన్నావ్. ఈ వర్షం— ముసురులో మరీ చికాగ్గా ఉంది" అన్నాను.

"ఇలాటి వర్షంలోనే యిరవై సంవత్సరాల క్రిందట ఈ వూర్లో ఓ విచిత్రం జరిగింది బాబూ—" అన్నాడు నవ్వుతూ.

"ఏమైంది?" అడిగాను కుతూహలంగా.

"సుమారు 20 ఏళ్ళ క్రిందట ఈ వూర్లో రాముడు అనేవాడుండేవాడు. తల్లి చిన్నప్పుడే పోయింది. వాడి తండ్రికి రెండు గొర్రెపోతులుండేవి. వాటికి సాటిఅయినవి ఈ చుట్టుపక్కల ఏ వూర్లోనూ లేవు. ఎవరి పోతులతో పందెం కట్టినా సోమయ్య పోతులదే గెలుపు. సోమయ్య ముసలివాడవటంతో రాముడే

వాటి ఆలనాపాలనా చూసేవాడు. పందేలకి కూడా రాముడే వెళ్ళేవాడు. వాడికి సర్వస్వం ఆ రెండు పోతులే అయ్యాయి. రాముడు పందెం కడుతున్నాడంటే జనం తిరణాల కెళ్ళినట్లు తరలివచ్చేవారు.

తల్లి లేని రాముడ్ని గారాబంగా పెంచాడు సోమయ్య. రాముడు రోజూ పోతుల్ని తీసుకెళ్ళి వూరి పొలిమేరల్లో ఉన్న కొండదగ్గర మైదానంలో మేపు కొచ్చేవాడు.

అదే కులంవాడే అప్పలసామి అనే మోతుబరి వుండేవాడు. ఒక్కర్తే కూతురు. పేరు లచ్చి. తల్లి పురిటిలోనే పోవడంతో అల్లారుముద్దుగా పెంచాడు అప్పలసామి కూతుర్ని.

అప్పలసామి గొర్రెల్ని లచ్చే మేపుకొచ్చేది.

రాము దెక్కడ పందెం కడుతున్నా లచ్చి తప్పకుండా వెళ్ళేది. లచ్చి కులానికి గొల్లపిల్ల అయినా బంగారం ఛాయలో ఎలాచూసినా అందగత్తెల్ని తలదన్నే అందం. ఆ అందాన్ని చూడ్డానికి ఎగబడేవోరు కుర్రకుంకలు. లచ్చి రాముడి పందెం చూడ్డానికెళితే లచ్చిని చూడ్డానికి ఎగబడేవోరు జనం.

పందెంతోపాటు వయసులో కండలు తిరిగిన రాముడ్ని చూసేది లచ్చి.

ఒకనాడు లచ్చి ప్రక్కవూరి తిరుణాలకెళ్ళి వస్తోంది. తన వూరి వాళ్ళంతా వెళ్ళిపోయారు- సాయంత్రమైపోయింది. ఒక్కర్తే గబగబా నడుస్తోంది. ఊరి పొలిమేరల్లో ఉన్న దెయ్యాలమఱ్ఱిని సమీపించింది. ఆ చెట్టు గురించి భయంకరమైన కథలు ప్రచారంలో ఉన్నాయి. చెట్టు దాటిపోతే వూర్లో పడ్డట్లే. లచ్చి గుండెలు గుబగుబలాడాయి.

మరొక్క రెండడుగులు.. అంతే.. ఏదో ఆకారం ఆ మహావృక్షం వూడలకు మధ్యగా వస్తోంది. లచ్చి కళ్ళు చీకట్లు కమ్మాయి. శరీరం చల్లబడి పోయి, నోరు తడారిపోయింది. లచ్చిని సమీపించి ఠక్కున వాటేసుకుంది.

"కెవ్" మని కేక పెట్టింది లచ్చి దిక్కులు అదిరిపోయేలా.

కొంచెం దూరంలో తిరణాలనుండి యింటికొస్తున్న రాముడి చెవిని పడిందా కేక.

చెట్టుక్రింద దృశ్యం చూసి ఒక్క పరుగులో వెళ్ళి ఆ ఆకారంమీద పడ్డాడు రాముడు.

చేతికొచ్చినట్టు చితకబాదేశాడు. రాముడి భుజంమీద బలంగా కొట్టి పారి పోయిందా ఆకారం.

వాడు చింతలపేట జమీందారు దగ్గర పనిచేస్తున్న వెంకన్న. ఆ జమీందారుకు కుడిభుజంలాంటివాడు. రాముడికి తెలుసు. అయితే లచ్చిమీద కన్ను పడినందుకు ఆవేశంలో తలపడ్డాడు- వాడు కొట్టిన దెబ్బకు జబ్బ బెణికిపోయింది.

లచ్చి రాముడ్ని లేవనెత్తి మెల్లగా నడిపించుకుంటూ తీసుకుపోయింది.

నాల్రోజులు మంచం దిగలేకపోయాడు. అయిదో రోజున గొర్రెల్ని కొండకి తోలుకెళ్ళాడు. దూరంగా ఎత్తైన బండపైన కూర్చున్న లచ్చి, రాముడ్ని చూసి పరుగెత్తుకొచ్చింది.

“ఏం రాముడూ! రావడం మానేశావు. నీ పోతులకి తిండెక్కువైందా” అంది నవ్వుతూ.

“నాల్రోజులై చెయ్యి స్వాధీనంలోకి రాలేదు. అందుకే రాలేకపోయాను.” అన్నాడు మెల్లగా.

“అయ్యో!! నా వల్లే కదూ దెబ్బ తిన్నావు.” అంటూ బాధపడిపోయింది. గిర్రున తిరిగాయి కళ్ళల్లో నీళ్ళు.

“ఛ ఛ. ఏడుపెందుకూ? నాకేమైందని” అన్నాడు రాముడు. తన కోసం, తను బాధపడితే చూళ్ళేని ఆడది, ఎందరో ఆమెవెంటపడినా, లక్ష్యపెట్టక తనమీద మనసైన పిల్ల దొరికినందుకు మురిసిపోయాడు.

ఆ రోజునుండీ, ఎన్నో సాయంత్రాలు ఆనందంగా గడిచిపోయాయి- కబుర్లతో.

ఒకనాడు రాముడు, లచ్చి కొండరాళ్ళమీద కూర్చొని కేరింతలుకొడుతూ మాటాడుకుంటూ ఉంటే అప్పలసామి చూశాడు.

గతుక్కుమన్నారిద్దరూ.

లచ్చికి ప్రాణాలే పోయినట్లయింది. తండ్రికి కోపంవస్తే బ్రహ్మదేవుడ్నయినా ఖాతరుచెయ్యడు.


లచ్చి అదిరే గుండెల్ని చిక్కబట్టుకొని యిల్లు చేరేసరికి- అప్పలసామి చుట్టకాలుస్తూ గుమ్మంలోనే, నులకమంచంమీద కూర్చున్నాడు. మెల్లగా లోపలికి జారుకుంటున్న లచ్చిని-

“లచ్చీ! యిలారా!” అన్నాడు అప్పలసామి.

వణికిపోతూ నిలబడిపోయింది.

“రాముడ్ని ఎన్నాళ్ళుగా తెలుసు?” తాపీగా అడిగాడు.

“నెల్రోజులుపైనే అయింది.” అంది మెల్లగా.




“ఎలా తెలుసు?” మరో ప్రశ్న.

జరిగిందంతా మెల్లగా చెప్పింది లచ్చి.

“అదు నీకు నచ్చాడా!” అడిగాడు మళ్ళీ.

అయ్య తనని పరీక్షిస్తున్నాడో, నిజంగానే ఆరాతీస్తున్నాడో- అర్థంకాలేదు లచ్చి.

“ఏం? మాటాడవేం??” ఉరిమినట్లయింది.

“నచ్చాడయ్యా” అనేసింది గుడ్లనీరుతో.

“పెళ్ళాడతావా!”

బావురుమంటూ తండ్రి కాళ్ళు చుట్టేసింది లచ్చి. “మన్నించయ్యా! తప్పయిపోయింది” అంటు వెక్కి వెక్కి ఏడవసాగింది.

లచ్చి మెడమీద వెచ్చని నీటిచుక్కలు పడ్డాయి.

అప్పలసామి రెండు కళ్ళూ తుడుచుకుంటూ “లే.... లే... లచ్చీ! దీనికి ఏడుపెందుకే పిచ్చిపిల్లా! ఆ రాముడు నీకు నచ్చితే, ఆడికే యిచ్చి పెళ్ళిచేస్తానే. ఆడికంటే మంచోడ్ని నాను మాత్రం తేగలనా! నీ మనసుకి నచ్చినోడితో నేను మనువు జరిపిస్తాను. నువ్వు సుఖంగా ఉండటమే నాకు కావాలి” అంటూ లచ్చి తల నిమిరాడు అప్పలసామి.

“నువ్వెంత మంచోడివయ్యా!” అంటూ తండ్రిని చుట్టేసింది లచ్చి.

అప్పలసామి తామిద్దర్నీ చూసికూడా అలా వెళ్ళిపోయాడు. లచ్చినేం చేస్తాదో అని దొంగచాటుగా వచ్చి అంతవరకూ జరిగింది చూసి, సంతోషంగా ఒక్క పరుగులో యిల్లు చేరుకున్నాడు రాముడు.

ఆ మర్నాడే అప్పలసామి రాముడి తండ్రి దగ్గరకెళ్ళి అల్లుడుగా చేసుకుంటానని చెప్పేశాడు. సోమయ్య ఆశ్చర్యానికి అంతులేదు.

సోమయ్యకు కలా, నిజమా అనిపించింది. తమకంటే ఆస్తి, అంతస్తుల్లో పెద్దవాడైన అప్పలసామి స్వయంగా వచ్చి రాముడ్ని అల్లుడిగా చేసుకొంటా నంటే ఏం చెప్పాలో నోట మాటరాలేదు.

"ఇదంతా రాముడి అదృష్టం" అన్నాడు.

పెళ్ళి ఖర్చులన్నీ తనే భరించి ఘనంగా జరిపించాడు పెళ్ళి- అప్పలసామి.

ఊరంతా నోరు నొక్కుకున్నారు. అప్సరసలాంటి లచ్చిని రాముడు పెళ్ళాడేస్తాడని కల్లోకూడా వూహించలేదు. కాకి ముక్కుకి దొండపండులా యింతకంటే మంచి సంబంధం దొరకలేదా! అని ఆడిపోసుకున్నారంతా.

ఎవ రెన్నివిధాల అన్నా అప్పలసామి మాత్రం సంతృప్తిపడ్డాడు. పాపం తల్లిప్రేమకు నోచుకోని ఆడకూతురు సాటి కులంవాడిని ఏరి కోరి ఎన్నుకొంది. మంచి ప్రధానం గాని, డబ్బు, పలుకుబడి ఎవడిక్కావాలి! అన్యాయం, అక్రమం, కుట్ర, కుతంత్రాలు లేనివాడు నా అల్లుడు అనేవాడు అప్పలసామి అందరితోనూ.

రాముడి జీవితంలో రెండో అధ్యాయం ప్రారంభమైంది. అప్పలసామి అల్లుడైనా తన ప్రాణప్రదమైన గొత్తెల్ని మేపడం- పందాలు కట్టడం మానలేదు. అంత అపురూపమైన రెండు పోతుల్లో ఒకటి హఠాత్తుగా చనిపోయింది ఒకనాడు. నెత్తీనోరు బాదుకొని విలపించాడు. అన్నం నీళ్ళు మానేసి ఏడుస్తూ కూర్చున్నాడు. లచ్చికూడా తిండి మానేసి తన ప్రక్కన ఏడుస్తూ ఉండటంతో, అప్పలసామి అనునయ వాక్యాలతో ఎంగిలిపడ్డాడు రాముడు.

"రావుడూ! పోతులకీ నీకూ ఉన్న అనుబంధం తెలుసు- కానీ ఏం చేస్తాం. దానికి ఆయువు తీరిపోయింది. రేపు తిరణాల కెళ్లండి యిద్దరూ- నీకు గుర్తుందా! క్రిందటి తిరణాలకే లచ్చీ నువ్వూ కలుసుకున్నారు! సరదాగా ఎల్లి రండి" అన్నాడు అప్పలసామి.

*　　*　　*

రంగురంగుల చీరలలోనూ, తలనిండా పువ్వులతోనూ తిరుగుతున్న

పల్లెపడుచులు, పట్టు లాల్చీలు, పంచెలు, చేతిలో కర్రలు పట్టుకొని జట్లు జట్లుగా, ఆడవాళ్ళని ఎగతాళిచేస్తూ తిరుగుతున్న యువకులు, చిన్నా, పెద్దా— కిటకిట లాడుతోంది తిరునాల. తినుబండారాలు, గాజులు, పూసలు, రిబ్బన్లు, ప్లాస్టిక్ సామాన్ల దుకాణాలముందు జనం విరగబడి కొంటున్నారు.

పగటివేషాలు, రంగులరాట్నాలు, తోలుబొమ్మలాటలు— రాముడు లచ్చి చెయ్యిపట్టుకొని అన్నీ చూపిస్తున్నాడు.

"మావా! బయసోక్కుపు చూద్దాం." అంది లచ్చి, ఒకవైపు చూపిస్తూ.

ఒక స్టాండుమీద పెట్టెలాంటిది పెట్టి దానికి నాలుగు కన్నాల్లోనున్న భూతద్దాలలో రెండు చేతులు అడ్డంపెట్టి, పిల్లా పెద్దా నిలబడి చూస్తున్నారు. లోపల కనిపించే బొమ్మలు పాట పాడుతూ, ఆ పెట్టెకి వెనుకవైపు అమర్చిన రేకుముక్కలమీద దరువేస్తున్నాడు పాటల కనుగుణంగా.

చెరో పదిపైసలు యిచ్చి చేతులడ్డం పెట్టి చూస్తున్నారు లచ్చి, రాముడు.

పాటలందుకొన్నాడు వాడు.

"కాశీపట్నం సూడరబాబూ, కళింగపట్నం సూడరబాబు, బొంబాయి పట్నం సూడరబాబూ, బోసిగుంటలు సూడరబాబూ...." అంటూ వాడు పాడుతూంటే కడుపు చెక్కలయ్యేలా నవ్వసాగింది లచ్చి, లోపల కనిపిస్తున్న బొమ్మలు చూసి.

"ఎవర్రా ఆ గుంట. బలేగుంది. పిటపిటలాడిపోతోంది." అన్న గొంతు వినబడింది రాముడికి.

అటు చూశాడు ఎవరినా అని.

చింతలపేట జమీందారు నిలబడి పక్కనున్న వెంకన్నని అడుగుతున్నాడు లచ్చిని చూస్తూ.

"అదా! బాబూ! అదిగో ఆ నల్లమొద్దు రావుడి పెళ్ళాంలెండి. ఆ గుంట కోసమే అడికి నాకు దెయ్యాలమట్టి దగ్గర గొడవైంది. సమయానికి అడ్డం పడ్డాడుగాని ఆ రోజే ఓ చూపు చూసేవాడ్ని." అన్నాడు వెంకన్న. "ఛీ.. ఛీ.. ఎదవమూక. పద.. లచ్చీ.. పోదాం" అంటూ లచ్చిని లాక్కుపోయాడు రాముడు.

* * *

మర్నాడు ఉదయం రాముడ్ని వెదుక్కుంటూ వచ్చాడు వెంకన్న.

"రావుడూ! చిన్న జమీందారుగారి పోతుతో పందెం కడతావేటి? అని అడగమన్నారు జమీందారు." అన్నాడు.

సాధారణంగా ఆ చుట్టుపక్కల ఎవరూ రావుడి పోతులతో ధైర్యంగా పందెం కట్టరు. ఎందుకంటే వాటికి సాటైనవి చుట్టుపక్కల ఎవరికీ లేవు. ఒకవేళ పందెం కట్టినా, నమ్మకం వదులుకోవాలి గెలుస్తామని.

తన పోతు గెలుస్తుందని దృఢవిశ్వాసంతో పందేనికి సిద్ధపడ్డాడు రాముడు

రాముడు చింతలపేట చినజమీందారుతో పందెం కట్టాడని వూరంతా పాకిపోయింది.

"ఒరేయ్ రావుడూ! ఈ దెబ్బతో జమీందారు పొగరణగ్గొట్టాలిరా. ఆడి కెంత గర్వం. ఆడి పోతుకి సాటైనది లేదని వాబులు కొడుతున్నాడు. ఈ దెబ్బతో ఆడి గర్వం వదిలిపోవాల" అని ఊరంతా ఉత్సాహపరిచారు.

రాముడి ధైర్యం రెట్టింపైంది.

తన పోతుకి బాగా తరిఫీదిచ్చాడు.

పొలిమేరల్లో నున్న వెయ్యేల మర్రిక్రింద పందెం కట్టారు.

ఆ మహావృక్షం దూరంనుండి చూస్తే ఒక పర్వతం లాగుంటుంది. ఆ రెండువూర్ల జనం ఆ మర్రిచెట్టు నీడలో సునాయాసంగా పడతారు.

పందెంరోజు రానే వచ్చింది.

చుట్టుపక్కల వూర్లవారంతా గుంపులు, గుంపులుగా పోగయ్యారు. లచ్చి చక్కని ఎరుపురంగుమీద తెల్లపువ్వుల చీర కట్టింది. అసలే అందంగా ఉన్న లచ్చికి ఆ చీర వంటికి హత్తుకొని వింత అందాలనిస్తోంది.

"రాముడూ! జమీందారుగారు పిలుస్తున్నారు" అంటూ తీసుకెళ్ళాడు వెంకన్న, పోతుని సిద్ధంచేస్తున్న రాముడ్ని.

"ఏం రావుడూ! పందేనికి సిద్ధమేనా?!" అడిగాడు జమీందారు చిరునవ్వుతో.

"చిత్తం." అన్నాడు రాముడు. ఆ నవ్వుకి అర్థం ఆలోచిస్తూ

"వెయ్యి రూపాయలు పందెం" అన్నాడు జమీందారు మీసం సవరించుకుంటూ.

"వెయ్యి రూపాయలు నే నెక్కడ తెచ్చేది బాబూ" అన్నాడు రాముడు ఆశ్చర్యంగా.

"అవున్రా! నిన్ను అమ్మేసినా వెయ్యి రూపాయలు రావు. నా పోతు ఓడిపోతే వెయ్యి రూపాయిలిస్తా.... మరి.... నీ పోతు ఓడిపోతే!?— నీ లచ్చిని వదులుకుంటావా!!!"

ఆశ్చర్యం, క్రోధం, ఆవేశంలో ఎర్రగా తయారైంది రాముడి ముఖం.

ఇదా! జమీందారు ఎత్తు.... ఇదా వీడి పన్నాగం. భగవంతుడు లేడా! సన్మార్గుల్ని రక్షించడానికి దుర్మార్గుల్ని శిక్షించడానికి ఆ పరమాత్ముడెప్పుడూ కనిపెడుతూనే ఉంటాడు. న్యాయం గెలుస్తుంది. రాముడి నోటంట ఏలాంటిమాట వస్తుందోనని గుడ్లప్పగించి చూస్తున్నారంతా. ఆ భయంకర నిశ్శబ్దం చీల్చుకుని రాముడి నోటివెంట ఒకే మాట ఖంగుమంది__

"సరే- అదే పందెం."

గొల్లుమన్నారంతా. జమిందారుని తిట్టనివాడు లేడు. జమిందారు పోతుని తీసుకొచ్చాడు వెంకన్న. అదిరిపడ్డాడు రాముడు దాన్ని చూసి. రాముడి పోతుకి రెండు రెట్లు బలంగా ఆరోగ్యంగా ఉందది.

అయినా పట్టు సడలలేదు- తన పోతు గెలుస్తుంది. రాముడు పోతుని కూడా ముగ్గులోకి తెచ్చాడు. పోతుల్ని బుర్రలు రగిలించి వదిలిపెట్టారు. రెండు పోతులు వెనక్కి వెళ్ళి- వేగంగావచ్చి తలలతో ఢీ కొన్నాయి. రెండూ సమంగా పోట్లాడుతున్నాయి. రాముడి పోతు చిన్నదైనా అతి చాకచక్యంతో దెబ్బతీస్తోంది. జనంలో వుషారెక్కువైంది. అరుపులు, కేరింతలు, ఈలలతో ఆ ప్రదేశం మారుమ్రోగిపోయింది. ఆకాశం కూడా ఒక్కసారి గర్జించింది. ఉధృతంగా పోరాడుతున్నాయి రెండు పోతులూ. జమిందారుపోతు వెనక్కి తగ్గసాగింది. వెనక, వెనక్కి పోయి-మహా వేగంతోవచ్చి రాముడి పోతుని ఢీకొంది. రాముడి పోతుకి ముక్కువెంట రక్తం ధారలు కట్టింది. తల గట్టిగా విదిలించి జోగుతూ వెనక్కి నడవసాగింది. "అయ్యోపాపం" అన్నారంతా. గుండెలు పిడికిట్లో పెట్టుకొని చూస్తున్నారు జనం. ఆకాశం మేఘావృతమైంది. జమిందారు, వెంకన్నల ముఖాలు వికసించాయి. 'ఇక నువ్వు నాదానవ్' అన్నట్లు మీసాలు తిప్పుతూ చూచాడు జమిందారు- లచ్చివేపు.

రాముడి పోతు నోటనుండీకూడా రక్తం కారడం మొదలైంది- చిన్నగా చినుకులు మొదలయ్యాయి.

అది బుర్ర క్రిందికీ, మీదికీ ఆడిస్తూ వెనకడుగులేస్తోంది. జమిందారు పోతు 'విజయం మనదే' అన్నట్లు జమిందారువైపు చూస్తూ నిలబడి ఉంది.

రాముడు లచ్చి చెయ్యిపట్టుకొని గబగబా ముందుకు లాక్కొచ్చాడు.

"పోతా!! యిదుగో నీ యజమాని పెళ్ళాం. నీకు యిన్నాళ్ళూ సేవచేసిన యజమాని__ మరికొన్ని క్షణాల్లో ఒక ఆడదాని మానం మంటగలిసిపోతోంది. దాన్ని కాపాడే బాధ్యత నీమీద ఉంది. నువ్వంటే నాకు ప్రాణం. నాకు లచ్చంటే

ప్రాణం. నీ ప్రాణంకోసం నా ప్రాణాన్ని బలిచేస్తావో, మరేంచేస్తావో నీ యిష్టం. నా పరువు, మర్యాదా నీ ముందు ఉంచాను–” అని అరిచాడు రాముడు ఆవేశంగా.

అంతవరకు వెనక్కి నడుస్తున్నదల్లా ఠక్కున ఆగిపోయింది. రాముడి పోతు. తళుక్కున మెరిసింది ఆకాశం. రాముడి మాటలు దానికి అర్థమయ్యాయో, ఆ ఆవేశం దానికే పుట్టిందో క్షణం బుర్ర అటూ ఇటూ ఊపి గట్టిగా దులిపింది.

రక్తం ఇంకా ఎక్కువగా ధారకట్టింది. అది నిలబడినచోట మడుగు కట్టింది. ఒక్క క్షణం... అంతే. రెప్పపాటుకాలంలో, శరవేగంతో ముందుకురికి జమిందారు పోతుని బలంగా గుద్దింది. ఆ హఠాత్పరిణామానికి జమీందారుపోతు తల ఫట్‌మని బద్దలై అరమైగుల దూరం వెళ్ళిపడింది. అంతే మరి లేవలేదు. దాని ప్రాణం ఎగిరిపోయింది. వర్షం ఉధృతమైనా ఎవరూ కదల్లేదు. రాముడిపోతు జోగుతూ నిలదొక్కుకొని ఒకసారి తలపైకెత్తి అందరి వైపూ చూసింది రక్తశిక్తమైన ముఖంతో.

ప్రాణాలు బిగపట్టుకొని చూస్తున్నారంతా వర్షంలో తడుస్తూ. భయంకర నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించింది. రాముడి పోతు అందర్నీ చూసి మెల్లగా తూలుతూవచ్చి లచ్చికాళ్ళమీద పడిపోయింది. విధి నిర్వహణ పూర్తయినట్లుగా దాని ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయాయి.

“నా పోతా!” అంటూ దిక్కులు అదిరిపోయేటట్లు అరిచాడు రాముడు.

రాముడూ–లచ్చి గొల్లున ఏడుస్తూ పోతుని చుట్టేశారు.

ఎవరికీ నోట మాటరాలేదు. అందరి కళ్లూ అశ్రుపూరితాలయ్యాయి.

అంత దుర్మార్గులైన జమీందారు–వెంకన్నలుకూడా కళ్ళు తుడుచుకున్నారు అప్రయత్నంగా. మౌనంగా రాముడ్ని సమీపించి వెయ్యిరూపాయలు రాముడి చేతిలో కుక్కి వెళ్ళిపోయాడు జమీందారు. దీనికంతటికీ కారణం జమీందారేనని అరవసాగారు జనం. నోటికొచ్చినట్లు తిట్టడం మొదలెట్టారు. రాముడ్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

“పోతా! నా లచ్చిని నాకు దక్కించావు. పందెం గెలిచావు. నువ్వే కాకుండాపోయినా....” అవే మాటలు– అవే పలవరింతలు. తిండి–తిప్పలు లేకుండా మంచంపట్టాడు రాముడు,

“మావా, నన్నొదిలిపోకు మావా! నువ్వుకూడా నా కన్యాయం చెయ్యకు

మావా!" అని రోదిస్తూ తన మావని దక్కించమని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది లచ్చి.

కొన్నాళ్ళకి లచ్చి పూజలే ఫలించాయో, ఆమె తాళిబొట్టు గట్టిదో- రాముడు తేరుకున్నాడు. అయితే మునుపటి రాముడికీ, ఈ రాముడికీ తేడా ఉంది. గొత్రెలు, పందాల వూసే మానేశాడు.

కరణంగారింట్లో పాలేరుగా తను, పనిమనిషిగా లచ్చి స్థిరపడిపోయారు.

అంతటితో రావుడి కథ పూర్తయింది—

*　　　*　　　*

నా కళ్ళు చెమ్మగిల్లాయి. అంతవరకు ఉన్న పెన్షను వదిలి గట్టిగా నిట్టూర్చాను.

"అయితే రావయ్యా! యిప్పుడా రావుడు బతికే ఉన్నాడా?!" అన్నాను.

ఆరిపోయిన చుట్ట మళ్ళీముట్టించి చలికి యింకా ముడుచుక్కూర్చుంటూ—

"ఏంబాబూ!? సూత్తారేటి!!" అన్నాడు.

"అవును రావయ్యా! ఓసారి తీసుకొస్తావా!!" అన్నాను ఎలాగేనా రావుడ్ని కలిసి మాట్లాడాలని.

నవ్వుతూ— "అడ్ని చూసేదేటి బాబూ- యిన్నాళ్ళూ చూస్తున్నారుగా- యిదుగో మీ ఎదుట కూర్చున్నాడు...."

"ఆ!!! నువ్వా.. మరి నీ పేరు...."

"ఆ రావుడ్ని నేనే బాబూ. తమ తాతాగారు రావయ్యా అని పిలిచేవారు. అందరూ రావయ్యా అనే పిలవడంతో రావయ్యనయ్యాను- లచ్చి పేరు బాగు లేదు అని దాన్ని లక్ష్మి అని పిలిచేవారు. అదే అలవాటైపోయింది.

"చినబాబూ! అమ్మగారు భోజనానికి పిలుస్తున్నారు" అంది లక్ష్మి (లచ్చి) వరండాలోకి వచ్చి.

ఆ లచ్చే . ఈ లక్ష్మి?! కళ్ళప్పగించి చూస్తూఉండిపోయాను. యిప్పటికీ అది అందంగానే ఉంది. నాకు ఆ పందెంరోజు సంఘటన కళ్ళముందు జరిగినట్లుంది.

"ఏటలా సూత్తారు బాబూ! అమ్మగారు వడ్డించేశారు రమ్మంతన్నారు." అంటూ లోపలికెళ్ళిపోయింది లక్ష్మి. ప్రకృతిలో జరిగిన అలజడి తగ్గి ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి.

"భోజనాని కెళ్ళండి బాబూ" అన్న రావుడి మాటలతో లోపల కడుగు పెట్టాను.

*